క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

చింతకొమ్మదిన్నె : కడప నగర శివార్లలోని ఊటుకూరు ఆర్టీఏ కార్యాలయం సమీపంలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న అవుల సందీప్‌కుమార్(21) విద్యార్థి మృతి చెందాడు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కడప నగరంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న సందీప్ కుమార్ తన స్నేహితునితో కలిసి కడపకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్‌కుమార్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సందీప్‌కుమార్‌తో పాటు మోటార్‌సైకిల్‌పై వున్న అతని స్నేహితుడు పుల్లాసి సంతోష్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కార్పొరేషన్ మెడికల్ అవినీతిపై ఫైల్స్-1 విడుదల

కడప కోటిరెడ్డిసర్కిల్ : చికెన్ వ్యర్థాల నుంచి కూడా అవినీతి చేయవచ్చని కార్పొరేషన్ అధికారులు నిరూపిస్తున్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అవినీతిపై కార్పొరేషన్ మెడికల్ అవినీతి ఫైల్స్-1గా విడుదల చేస్తున్నామని తెలిపారు. కడప కార్పొరేషన్ పరిధిలోని చికెన్ షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను నెల్లూరు జిల్లాలోని చేపలు, రొయ్యల చెరువులు, పందుల పెంపకానికి రవాణా చేస్తారన్నారు. కడప కార్పొరేషన్ నుంచి రోజుకు 20 నుంచి 25 డ్రమ్ములు వెళతాయని, దాదాపుగా కొన్ని కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు అర్థమవుతోందన్నారు. దీనిపై మున్సిపల్ మంత్రి నారాయణ, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు భారతీయ జనతా పార్టీ తరఫున నివేదిక అందించి విచారణ చేపట్టాలని కోరతామన్నారు.

బాధ్యతల స్వీకరణ



టూటౌన్ సీఐ నాగార్జున



తాలూకా సీఐ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : కడప నగరంలో టూటౌన్ సీఐగా బి.నాగార్జున, కడప తాలూకా సీఐగా జి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున 2004 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ, జిల్లాలో పలు చోట్ల పని చేశారు. 2018లో సీఐగా పదోన్నతి పొందారు. 2009లో రాష్ట్రపతి గ్యాలంట్రీ, 2010 సీఎం శౌర్యపతకం వరించాయి. కర్నూలు, ఆర్ఎస్ఏటీఎస్ఎఫ్ కడప, కడప సీసీఎస్, రైల్వేలో సీఐగా అక్కడి నుంచి కడప టూటౌన్ సీఐగా బదిలీ అయ్యారు.

- కడప తాలూకా సీఐగా జి.వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లాకు చెందిన జి.వెంకటేశ్వర్లు 2002 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ, అనంతపురం జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వహించారు. 2011లో సీఐగా పదోన్నతి పొంది కడప జిల్లాలోని జమ్మలమడుగు, వేంపల్లి సర్కిల్‌లో విధులను నిర్వహించారు. ప్రస్తుతం కదిరి రూరల్ నుంచి బదిలీపై కడప తాలూకా పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధ్యతలను స్వీకరించారు.

ఘనంగా రక్షాబంధన్

కడప కల్చరల్ : అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆశారేఖ ఫౌండేషన్ అధ్యక్షురాలు నెమలిదిన్నె నాగవేణి అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. సోమవారం అనాథ బాలల ఆశ్రమాలకు వెళ్లి వారికి రాఖీ కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంస్థ ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా అనాథ పిల్లలకు రాఖీలు కట్టడం ఆనవాయితీగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ హోంలో ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు రాఖీలు కట్టారు. అనంతరం నగరంలోని ఇతర ఆశ్రమాలకు కూడా వెళ్లి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను వినియోగించుకోవాలి

కడప అగ్రికల్చర్ : లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకుని సలహాలను పొందవచ్చని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రైతు బజార్‌లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సదర్శించారు. అక్కడ ఉన్న రిజిస్టర్‌ను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నాయక్, పారా లీగల్ వలంటీర్లు ఈశ్వరయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు అభినందన

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కట్టా వెంకటేశ్వర్లు కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా నియమితులై వెళ్తున్న సందర్భంగా వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు రిలీవింగ్ ఆర్డర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైవీయూ దూరవిద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్ బాబు, కెమిస్ట్రీ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ కృష్ణారావు పాల్గొన్నారు.

కాలిబాట.. లాభాల పంట



వరినాట్లు వేస్తున్న కూలీలు



వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకున్న రైతులు

- వరిలో కాలి బాటలతో చీడపీడలు దూరం
- ఎరువులు, మందుల పిచికారికి అనుకూలం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కడప అగ్రికల్చర్ : ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పెన్నానదికి నీరు వచ్చి చేరింది. దీంతో భూగర్భ జలాలు బాగా పెరిగాయి. ఫలితంగా బోర్లలో నీరు బాగా పెరిగింది. దీంతోపాటు వాటర్‌పంప్ స్కీమ్‌ల ద్వారా నీరు బాగా వస్తుంది. దీంతో నదీ పరీవాహక ప్రాంతమైన పాత కడప, నానాపల్లి, దేవునికడప, ఓబులంపల్లి, ఉక్కాయపల్లె తదితర ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నాయి. కడప మండల పరిధిలో 1520 హెక్టార్ల సాగు భూమి ఉంది. ఇందులో ప్రస్తుతం చాలా మంది రైతులు నారుమడులను సాగు చేస్తుండగా మరి కొంత మంది రైతులు వరినాట్లు వేస్తున్నారు. కడప మండల పరిధిలో ప్రస్తుతం 152 హెక్టార్లకుపైగా వరి పంటను సాగు చేశారు. అయితే వరినాట్లు వేసిన



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

కడప నియోజకవర్గ సమాచారం

రైతుల సంఖ్య	4639
మొత్తం భూమి	3562 హెక్టార్లు
సాగు భూమి విస్తీర్ణం	1520 హెక్టార్లు
ప్రస్తుతం సాగైన విస్తీర్ణం	152 హెక్టార్లు
సాగైయ్యే ప్రధాన పంటలు	వరి, ఉల్లి, మినుము, కొర్ర తదితరల పంటలు

రైతులు వారు సాగు చేసిన వరిపంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే.. రైతులకు మేలు జరగడంతోపాటు చీడపీడలకు సులభంగా తట్టుకునే అవకాశం ఉంటుందని కడప మండల వ్యవసాయ సిబ్బంది రైతన్నలకు సూచిస్తున్నారు. దీంతోపాటు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కాలిబాటల వల్ల లాభాలు

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు చాలా మేలు జరగనుంది.

- వరిపంటను సాగు చేసిన రైతులు తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలి.
- మొక్కలకు గాలి, వెలుతురు బాగా అంది చీడపీడలు రాకుండా ఉంటాయి.
- పురుగు నివారణ మందులు పిచికారి చేసుకునేందుకు సులభంగా ఉంటుంది. ప్రతి మొక్కపైన మందు సులభంగా పడేందుకు వీలు ఉంటుంది. ఒక పక్క ఎక్కువ మరో పక్క తక్కువగా మందు పిచికారి అయ్యే ప్రమాదం ఉండదు.
- ఎరువులను సులభంగా చల్లుకునేందుకు వీలు ఉంటుంది.
- వరిమడిలో భూమి తడి లేకుండా సులభంగా ఆరబెట్టేందుకు వీలవుతుంది.
- వరికోత సమయంలో సులభంగా కోతలు కోసుకునేందుకు వీలుంటుంది.

ఏర్పాటు చేసుకుంటున్నాం



నేను చాలా కాలం నుంచి ఏటా వరిపంటను సాగు చేస్తున్నాను. వరిమడిలో క్రమం తప్పకుండా కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటున్నాను. దీనివల్ల సులభంగా ఎరువులు, మందులను పిచికారి చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మొక్కకు తగినంత గాలివెలుతురు తగలడం వల్ల ఏపుగా పెరుగుతుంది.

– నాగేశ్వరరెడ్డి, రైతు, పాతకడప

అవగాహన కల్పిస్తున్నాం



వరినాట్లు వేసిన రెండు, మూడు రోజుల్లో రైతులకు కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. మేము కూడా దగ్గరుండి ఎలా తీయాలనే విషయాలను తెలియచేస్తాం. కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడ వల్ల కలిగే లాభాల గురించి తెలియజేస్తాం. దీంతో దాదాపు అందరూ రైతులు కాలిబాటలను ఏర్పాటు చేసుకుంటారు.

– పావని, వ్యవసాయ విస్తరణ అధికారి, కడప

మొక్కలు ఏపుగా పెరుగుతాయ్



వరిలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. మొక్కకు కావాల్సిన గాలి వెలుతురు బాగా తగులుతుంది. దీంతో దుబ్బు బాగా కట్టి మొక్కల సంఖ్య పెరుగుతుంది. వరిపంటకు చీడపీడలు ఆశించగానే కాలిబాటలు ఉంటే సులభంగా మందులను పిచికారి చేసుకోవచ్చు.

–సురేష్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, కడప

శ్రావణ పౌర్ణమి పూజలు

కడప కల్చరల్ : జగన్మాత శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పవిత్ర నదీజలాలు నింపిన 18 కలశాలకు విశేష పూజలు చేసి ఆ కలశాలను 18 మంది దంపతులు ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కలశాల్లోని పుణ్య నదీజలాలతో అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ యాగ మండపంలో చండీహోమం, వరుణ మంత్ర హోమం నిర్వహించారు.

అన్నదానం

కడప అర్బన్: శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా శంకరాపురం అభయాంజనేయ స్వామి ఆలయం దగ్గర శ్రీకాశీ విశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు పేదలకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెట్9 అధినేత కడిమెళ్ల రాణాప్రతాప్, పెట్రోల్ బంక్ రఘు, శ్రీకాశీవిశ్వనాథ సేవాసమితి సభ్యులు రెడ్డి లక్ష్మణ్, రవి, వెంకటసురేష్ బాబు, పురుషోత్తం, దామోదర్, టైలర్ రవి, రాజశేఖర్‌రెడ్డి, మధు, మునిజ, అనురాధ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో వ్రతం

కడప కల్చరల్ : శ్రావణ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీసత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం చేపట్టారు. ప్రధాన అర్చకులు రాజేష్‌భట్టర్, విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు వ్రత విధానం తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రైవేట్ హాస్టళ్లలో తనిఖీలు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప నగరంలోని 13 కళాశాలల విద్యార్థినులు ప్రైవేట్, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌ను పోలీసులు సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం రాత్రి కడప నగరంలోని హాస్టళ్లను మహిళా ఎస్ఐలు శాంతమ్మ, లక్ష్మి, నస్రీన్, హైమావతి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. అలాగే బాయ్స్ హాస్టళ్లను పోలీసులు తనిఖీ చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కడప అర్బన్: కడప రిమ్స్ పీఎస్ పరిధిలో చిన్నచౌక్, కొండాయపల్లికి చెందిన సల్ల నాగేశ్వర్‌రెడ్డి చలమారెడ్డిపల్లి క్రాస్ రోడ్ వద్ద గంజాయిని విక్రయిస్తుండగా సీఐ సీతారామిరెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 5వేలు విలువైన 1.1 కిలో గంజాయిని సీజ్ చేశారు.

విజయదుర్గా కాలనీలో చోరీ

కడప అర్బన్ : కడపలోని విజయదుర్గా కాలనీలో రిటైర్డ్ ఉద్యోగి జయరాములు హైదరాబాద్‌లోని తన సోదరుని ఇంటికి వెళ్లి తిరిగి రాగానే అతని ఇంటిలో దొంగలు చొరబడి మూడు తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ. 30 వేలు నగదును దొంగిలించుకుని వెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కడప నగరంలోని విజయదుర్గా కాలనీలో రెండు రోజుల క్రితం రెండు రోడ్లలో దుండగులు చోరీకి యత్నించి విఫలమయ్యారు.

పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కడప కార్పొరేషన్ : కడపలో కుక్కలు పెంచుకునే వారు రిజిస్ట్రేషన్ చేయించుకొని అనుమతి పొందాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో 8340 కుక్కలు ఉన్నాయని, అందులో 60 శాతం కుక్కలకు స్టెరిలైజేషన్(ఆపరేషన్లు) పూర్తి చేశామన్నారు. కుక్కలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలనిఆలోచన చేస్తున్నామని, ప్రత్యేక ప్రాంతాల్లో ఆహారం అందించేందుకు ప్రణాళిక రచిస్తున్నామన్నారు.

ఫార్మసిస్టుల రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలి



సర్టిఫికెట్లను రెన్యువల్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఫార్మసిస్టులు

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ దాదాపు 12 వేలకు పైగా రిజిస్టర్డ్ ఫార్మసిస్టుల రెన్యువల్ దరఖాస్తులను పెండింగులో పెట్టి ఫార్మసిస్టుల హక్కులను కాలరాస్తోందని ఏపీ ఫార్మ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ సింగనమల సుమన్ కోరారు. సోమవారం ఏపీ ఫార్మ జేఏసీ సభ్యులు కడప కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలిసి ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఫార్మసీ చట్టం 1948ను రాష్ట్రంలో అమలు చేయకుండా ఏపీ ఫార్మసీ కౌన్సిల్ నిబంధనలను గాలికొదిలేసిందన్నారు. సెక్షన్ 26 కింద ఫార్మసీ ఇన్‌స్పెక్టర్ల నియామకం చేసి ప్రతి మందుల షాపులో ఫార్మసిస్టు ఉండేలా సెక్షన్ 42ను అమలు చేయాల్సిన బాధ్యత ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు ఉందన్నారు. కానీ రాష్ట్రంలో చట్ట ప్రకారం నేరుగా నియంత్రించకుండా.. ఫార్మసిస్టులు తమ సర్టిఫికెట్లను బాడుగలకు ఇస్తున్నారని నిందవేసి, రెన్యువల్ ప్రక్రియలను ఏళ్ల తరబడి ఆపివేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫార్మ జేఏసీ కమిటీ చైర్మన్ సురేష్, సీనియర్ ఫార్మసిస్టులు చలపతి, సుబ్రహ్మణ్యం, ఏనుగుల నరసింహ, అఖిల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లు, వాచ్‌మెన్లకు వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు, పాఠశాలల స్వీపర్లు, వాచ్‌మెన్ల నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్లకు గత ఆరు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదంటూ ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుగా ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామంటూ ప్రభుత్వం చేస్తున్న మాటలు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడానికి రూ.6 వేల వేతనంతో ఆయాలుగా కొందరిని నియమించారని, వీరికి అమ్మ ఒడి నిధుల నుంచి వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. పాఠశాల తెరిచినప్పటి నుంచి ముగిసేవరకు అక్కడే ఉండాల్సి వస్తోందని తెలిపారు. పారిశుధ్య కార్మికుల వేతనాన్ని వీరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. స్వీపర్లపై విద్యాకమిటీల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. రాజకీయ వేధింపులను తక్షణమే ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, మంజుల, షకీల, భారతి, వెంకటమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఆస్తి పన్ను పెంపు ఉపసంహరించుకోవాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో ఇష్టారాజ్యంగా ఆస్తిపన్ను పెంచడాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వ్యాప్త ఆందోళన కార్యక్రమాల పిలుపులో భాగంగా కడప నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సీపీఐ కడప నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసినట్లుగానే, ప్రతి ఏటా ఆస్తి పన్నులు పెంచేందుకు గత ప్రభుత్వం 2020 మున్సిపల్ చట్ట సవరణలు చేసి తీసుకొచ్చిన 197, 198, 199 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా అమలుకాని పన్నుల విధానం ఒక్క కడప నగరపాలక సంస్థలోనే 2020 సర్దుబాటు చార్జీల పేరిట సుమారు రూ.18 కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపడం సరికాదు అన్నారు. అనంతరం కమిషనర్ వైఓ నందన్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ, సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఉద్దే మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు నాగార్జున రెడ్డి, మునయ్య, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్య, నాగరాజు, నరసింహులు, అంకుశం, మదార్జ్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లె దళితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కడప కార్పొరేషన్ : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, పక్కా గృహాలు కూడా మంజూరు చేయాలని రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కిషోర్ బూసిపాటి, బి.నారాయణ, ఎస్ఏ సత్తార్, గుర్రప్ప, సీఆర్‌వీ ప్రసాద్, శ్రీరాములు, రసూల్ కోరారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. సి. కొత్తపల్లె గ్రామ వాసులు ఇంటి స్థలాలు లేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే, తెలుగుదేశం పార్టీ ముసుగులో ఉన్న అగ్రకుల స్తుడైన రామచంద్రారెడ్డి 25 మంది అనుచరులతో వెళ్లి గుడిసెలు తొలగించి, ఈ రెండు ఎకరాల స్థలాన్ని తాను కొన్నానని, దళితులను ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. మహిళలని చూడకుండా జుట్టుపట్టి ఈడ్చి పిడిగుద్దులు గుద్దారన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అధికార పార్టీ నాయకులను వెనకేసుకు రావడం దారుణమన్నారు. దళితులకు ప్రాణ రక్షణ కల్పించి, జిల్లాలో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బద్వేల్ పరిధిలో భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్నారు. వచ్చే శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీలతో సమావేశం ఏర్పాటు చేసి భూ ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి బాధితుల తరఫున రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కూడా రావాలని సూచించారు.

చరిత్రకు సజీవ సాక్ష్యం చిత్రం

- కలెక్టర్ శివశంకర్ లోతేటి



ఫొటో ప్రదర్శనను ప్రారంభిస్తున్న వైవీయూ వీసీ కృష్ణారెడ్డి, కలెక్టర్ శివశంకర్‌లోతేటి



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వివిధ కళాశాలల విద్యార్థులు

కడప కల్చరల్ : కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకు చిత్రం సజీవ సాక్ష్యమని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. కడప జిల్లా సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని, వాటి విలువను నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో భారీ ఫొటోగ్రఫీ ప్రదర్శన నిర్వహించారు. వైల్డ్ లైఫ్ చిత్రాలు, సహస సౌందర్యమైన చిత్రాలు, జిల్లాలోని ప్రసిద్ధ శిల్పకళ, నదులు, ఆలయాలకు సంబంధించి కళ్లు చెదిరే దాదాపు 450కి పైగా రంగురంగుల ఫొటోలను ఈ ప్రదర్శనలో ఉంచారు. స్థానిక ప్రజలు, సమీప పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ చిత్రాలను తిలకించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ హాబీ స్థాయి నుంచి జీవనోపాధిగా ఎదిగిందని, ప్రతి ఒక్కరూ ఉత్తమమైన అభిరుచిని పెంచుకోవాలని సూచించారు. కళలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక అంశాల గురించి ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావించారు. జిల్లాలో తెలుగుభాషకున్న ప్రాధాన్యతను వివరించారు.

అభినందించిన కలెక్టర్

ఫొటోలను సేకరించడంలో ప్రముఖ ఫొటోగ్రాఫర్, జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ఆలయాలు, దర్శనీయ స్థలాలతో రూపొందించిన 15 నిమిషాల వీడియో ఫిల్మ్‌ను తిలకించారు. అనంతరం ఆలయ కోలాటం బృందం ప్రదర్శించిన నృత్యాన్ని తిలకించి వారిని అభినందించారు. తొలుత కలెక్టర్‌కు ఆలయ నిర్వాహకులు డి.వెంకటరెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో దేవతామూర్తులను దర్శింపజేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు ఫొటోలను చూసేందుకు విచ్చేసిన వారితో ఆ ప్రాంతమంతా తిరునాలను తలపించింది. యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మన సంస్కృతి సంప్రదాయాల గురించి అవగాహన చేసుకుని వాటిని రక్షించి భావితరాలకు అందించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంటాక్‌ను అందరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ యల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పాతకాలం కెమెరాల ప్రదర్శన, వాటి పనితీరుపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, వైవీయూ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ఇంటాక్ సభ్యులు కొండారెడ్డి, లెక్చరర్ గురుమోహన్‌రెడ్డి, లయన్ సంజీవరెడ్డి, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వీసీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఫొటోగ్రఫీ శాఖను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. చారిత్రక వాస్తవాలు, అనుభూతులను అందించేదే ఫొటోగ్రఫీ అని, ఇది మానవాళికి ఒక వరమన్నారు. ఫొటోగ్రఫీ మనజీవితంలో విడదీయరాని బంధంగా మారిందన్నారు. సెల్ఫీలు మొదలు యుద్ధాలు, మానవహక్కుల ఉల్లంఘనలకు డాక్యుమెంట్ చేయడం వరకు వివిధ మార్గాల్లో మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారన్నారు. పెద్దపెద్ద నగరాలకే పరిమితమైన ఈ కోర్సు నేడు కడప విద్యార్థులకు అందుబాటులో ఉండటం ఒక వరమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది కళ, క్రాఫ్ట్, సైన్స్, చరిత్ర అన్నారు. అలాగే చారిత్రాత్మక సంఘటనల డాక్యుమెంటేషన్ నుంచి వ్యక్తిగత మోడల్ వరకు మాధ్యమం ఎలా అభివృద్ధి చెందిందో గుర్తించడానికి ఈ రోజు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఫొటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటోగ్రఫీ ప్రదర్శనను వీసీ ప్రారంభి తిలకించారు. అనంతరం విద్యార్థులు తీసిన ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ శాఖ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా బోధించాలి



ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఇర్షాద్ అమ్మద్

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనలలో మెలకువలు తెలుసుకుంటూ బోధించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కడప మండల విద్యాశాఖాధికారి-2 ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం నగర పాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అన్నారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయురాలు జావీదా ఖానమ్ మాట్లాడుతూ బోధన బాధ్యతగా సాగించినప్పుడే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో సీఆర్పీ ఆదిమూలం శంకర్, ఆర్పీలు ఎస్ఎండీ ఇలియాస్ బాషా, అక్రమ్, ఫైరోజ్ బాషా, మహబూబ్ బాషా, ఉర్దూ విభాగానికి చెందిన సోషల్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో కాలువలకు అడ్డంగా, రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు సచివాలయ సిబ్బంది ప్రణాళికలు తయారు చేయాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా వరదనీటి కాలువలు, కొండాయపల్లె ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు లేకుండా తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ ధనలక్ష్మి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

- నగరపాలక సంస్థ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

అంగన్‌వాడీలకు పదోన్నతులు కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్లకు పదోన్నతులు, బదిలీలు కల్పించాలని అంగన్‌వాడీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మనోహర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారంలో కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారిని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో అంగన్వాడీలకు పదోన్నతులు ఇచ్చారని, అయితే మన జిల్లాలో ఇవ్వలేదన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి, ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి

కడప అర్బన్ : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. గుర్రప్ప నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ. డాక్టర్స్ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు న్యాయవాదుల తరఫున సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు పి. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి జాన్ కెనడీ, ట్రెజరర్ ఎం.వి సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీ ఎన్. చిన్నయ్య, లైబరీ సెక్రటరీ పి. నాగభూషణం, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.